క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



ఐనవోలు : మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన కూస నాగరాజుకు మంజూరైన రూ.1.5 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆయనకు బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ హనుమకొండలోని తన నివాసంలో శనివారం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కడుదూరి రాజు, మాజీ ఎంపీటీసీ పెండ్లి తిరుపతి, నాయకులు ఆగారెడ్డి, చెంచు మల్లయ్య, చెంచు రవి, చెంచు ప్రతాప్, రాజారపు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ దయాకర్ నివాళి

పరకాల : పట్టణానికి చెందిన వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొచ్చు వినయ్ అనారోగ్యంతో మృతి చెందగా అతడి మృతదేహానికి వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, మాజీ జెడ్పీ చైర్మన్ సాంబారి సమ్మారావు, తదితరులు నివాళులర్పించారు. పట్టణంలో వినయ్ అంత్యక్రియలు శనివారం జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీ దయాకర్, మాజీ జెడ్పీ చైర్మన్ సమ్మారావు, స్థానిక మున్సిపల్ చైర్పర్సన్ సోదా అనిత రామకృష్ణ, బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, పలు రాజకీయా పార్టీల నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి వినయ్ మృతదేహానికి నివాళులర్పించారు.

పరామర్శ

శాయంపేట : మండలానికి చెందిన ఆర్ఎంపీ ప్రభాకర్ సతీమణి సంధ్యారాణి మృతి చెందగా బాధిత కుటుంబాన్ని వరంగల్ జెడ్పీ చైర్పర్సన్ గండ్ర జ్యోతి, టీపీసీసీ సభ్యుడు గండ్ర సత్యనారాయణరావు శనివారం వేర్వేరుగా పరామర్శించారు. తొలుత వారు సంధ్యారాణి చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించారు. అనంతరం ప్రభాకర్ను పరామర్శించి ప్రమాదం జరిగిన తీరుపై అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, సర్పంచ్ కందగట్ల రవి, ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్, పీఏసీఎస్ చైర్మన్ కుసుమ శరత్, వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతిరెడ్డి, మాజీ చైర్మన్ రాజిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులున్నారు.

చికిత్స పొందుతున్న గృహిణి మృతి

ఎల్కతుర్తి : అత్తమామల వేధింపులు భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన గృహిణి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిన ఘటన మండలంలోని కేశవాపూర్ శివారు రామకిష్టాపూర్లో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై జక్కుల పరమేష్ కథనం ప్రకారం.. హసన్పర్తి మండలంలోని అన్నసాగర్ గ్రామానికి చెందిన సూర రాజయ్య పెద్ద కూతురు సంధ్య ఈనెల 15న తన ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా కుటుంబీకులు ఆమెను వరంగల్లోని ఎంజీఎంలో చేర్చారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మ్యాక్స్కేర్ ఆస్పత్రిలో చేర్చారు. సంధ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తండ్రి సూర రాజయ్య ఫిర్యాదు మేరకు బొంత రవీందర్, బొంత రాధ, బొంత అర్జున్, బొంత సంతోష్, బొంత మంజులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు



ఐనవోలు : మండల కేంద్రానికి చెందిన 13వ వార్డు సభ్యుడు బుర్ర సతీష్ మమత, బీఆర్ఎస్ నాయకుడు అమరవాది రవి, జనసేన మండల అధ్యక్షుడు మహ్మద్ రహీమ్ కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ కోఆర్డినేటర్ నమిండ్ల శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్లో శనివారం చేరారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయం వద్ద వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం నమిండ్ల శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సమ్మెట మహేందర్, మహ్మద్ రఫీ, కొత్తూరి సునీల్, మహ్మద్ రహీం పాషా, యాకర సాంబయ్య, కట్కూరి బాబు, మహ్మద్ ఇబ్రహీం, యాకర అశోక్, రాజు పాల్గొన్నారు.

టీఎస్పీఎస్సీ అక్రమాలపై విచారణ చేపట్టాలి

ధర్మసాగర్ : టీఎస్పీఎస్సీ అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్రెడ్డి డిమాండ్ చేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో హనుమకొండలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయగా ఆందోళనకారుల్లో కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా రాకేష్రెడ్డి మాట్లాడారు. అరెస్టైన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శులు జయంత్ లాల్, సదానందంగౌడ్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్రెడ్డి ఉన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యం

- 'అంబుజా' నిర్వాహకుడు మదన్మోహన్

ఎల్కతుర్తి : విద్యార్థులను ప్రోత్సహించేందుకే పరీక్షా ప్యాడ్లు పంపిణీ చేస్తున్నట్లు హుజురాబాద్ అంబుజా గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు పీవీ.మదన్మోహన్ రావు తెలిపారు. భీమదేవరపల్లి మండలంలోని వంగర గ్రామంలోని డాక్టర్ రంగారావు స్మారక గురుకుల కళాశాలలోని సీనియర్ ఇంటర్ విద్యార్థులకు ఆయన శనివారం పరీక్షా ప్యాడ్లు పంపిణీ చేసి మాట్లాడారు. పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతోనే పీవీ.నర్సింహారావు ప్రధానిగా ఉన్న కాలంలో నాటి విద్యా శాఖ మంత్రి డాక్టర్ పీవీ.రంగారావు పాఠశాలను ప్రారంభించారని గుర్తు చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ మాట్లాడారు. కళాశాల అభివృద్ధికి నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, పీవీ కుటుంబం సహకరిస్తున్నారని చెప్పారు. కళాశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.



కేజీబీవీలో విద్యార్థినికి పరీక్ష ప్యాడ్ అందజేస్తున్న జగదీశ్వర్

కార్యక్రమంలో కళాశాల సిబ్బంది ధర్మ, భార్గవి, అఫ్రీన్ సుల్తానా, అముక్త, సైకా, సుధారాణి, శిరీష, రజిత, వసంత, మహేష్, రవి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో..

మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు హుజురాబాద్కు చెందిన గంగిశెట్టి మధుకరమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్ శనివారం పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. అనంతరం జగదీశ్వర్ మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. కేజీబీవీలో 44, జెడ్పీ హైస్కూల్లో 130 మందికి పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారిణి పల్లె అనిత దేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మీ, ఉపాధ్యాయినులు అనురాధ, విజయ, సునీత, సుజాత, దివ్య, తిరుమల పాల్గొన్నారు.

సమన్వయంతోనే మండల అభివృద్ధి

ఎల్కతుర్తి : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వ్యవహరిస్తేనే మండల అభివృద్ధి జరుగుతుందని ఎంపీపీ జక్కుల అనిత స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. తొలుత ఆయా శాఖల అధికారులు నివేదికలు చదివి వినిపించారు. పలువురు ప్రజాప్రతినిధులు గ్రామాల్లోని సమస్యలు ప్రస్తావించగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కాగా సర్వసభ్య



మాట్లాడుతున్న ఎంపీపీ జక్కుల అనిత

సమావేశాన్ని సాదాసీదాగా నిర్వహించారన్న వ్యాఖ్యలు వినవచ్చాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్, మిషన్ భగీరథ డీఈ స్వేత, సర్పంచ్లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

బావిలో పడి సర్పంచ్కు గాయాలు

ధర్మసాగర్ : వేలేరు సర్పంచ్ కాయిత మాధవరెడ్డి ప్రమాదవశాత్తు బావిలో పడి గాయాలపాలయ్యాడు. వివరాలిలా.. మాధవరెడ్డి శనివారం హనుమకొండకు వెళ్లి తిరిగి వేలేరుకు వస్తుండగా నారాయణగిరి గ్రామ శివారులోని బండతండా సమీపంలో అతడి ద్విచక్ర వాహనం అదుపు తప్పింది బావిలో పడింది. ఈ ఘటనలో బావిలపడ్డ సర్పంచ్ ఈత కొడుతుండగా స్థానిక రైతులు తాడు సాయంతో బైటకు తీశారు. అనంతరం సర్పంచ్ మాధవరెడ్డికి 108 సిబ్బంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ విద్యాసాగర్, పైలెట్ దయాకర్ అక్కడకు చేరుకుని ప్రాథమిక చికిత్స అందించి ఆస్పత్రికి తరలించారు.

మహిళల రక్షణే 'సఖి' ధ్యేయం

ఐనవోలు : మహిళల, బాలికల రక్షణే ధ్యేయంగా 'సఖి-వన్స్టాప్ సెంటర్' సేవలు అందిస్తుందని ఆ సంస్థ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, కేస్ వర్కర్ హరిత తెలిపారు. మండలంలోని కొండపర్తి గ్రామంలో హనుమకొండ సఖి సెంటర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అవగాహనా సదస్సులో వారు మాట్లాడారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళ అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి సెంటర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భార్యాభర్తలకు కౌన్సిలింగ్ చేయడంతోపాటు వరకట్న, లైంగిక వేధింపులు, గర్భవిచ్ఛిత్తి తదితర సమస్యలకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలకు కౌన్సిలింగ్ చేయడంతోపాటు న్యాయ, పోలీస్, వైద్య, తాత్కాలిక వసతి



మాట్లాడుతున్న శ్రీదేవి, హరిత

సహాయం అందించనున్నట్లు వివరించారు. బాధిత మహిళలు, బాలికలు 0870-245112 లేదా టోల్ ఫ్రీ నెంబర్ 181కు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీసీ శంకరయ్య, వీఓఏలు, మహిళ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్కు సీపీ అభినందన



దామెర : దామెర పోలీస్స్టేషన్లో కానిస్టేబుల్గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ ఇటీవల రాష్ట్రస్థాయిలో డీజీపీ చేతుల మీదుగా అవార్డు అందుకోగా ఆయన్ను వరంగల్ పోలీస్ కమిషనర్ (సీపీ) రంగనాథ్ శనివారం అభినందించారు. రిసెప్షన్ వర్టికల్ విభాగంలో ప్రతిభ చాటిన సందర్భంగా శ్రీనివాస్కు ఇటీవల హైదరాబాద్లో జరిగిన కార్యక్రమంలో డీజీపీ అంజనీకుమార్ అవార్డు అందజేశారు. శ్రీనివాస్ను డీసీపీ పుష్ప, ఏసీపీ జూపల్లి శివరామయ్య, పరకాల రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై ముత్యం రాజేందర్ అభినందించారు.

'పరకాలలో పార్టీ బలోపేతమే లక్ష్యం'

దామెర : పరకాల నియోజకవర్గంలో బీజేపీ బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ ఇన్చార్జ్ పెసరు విజయ్చందర్రెడ్డి సూచించారు. మండలంలోని ఊరుగొండలో పోలింగ్ బూత్ స్వశక్తి అభియాన్, శక్తి కేంద్రాల ఇన్చార్జ్ల అల్పకాలిక్ విస్తరక్ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్చందర్రెడ్డి మాట్లాడారు. పార్టీ తీసుకుంటున్న అన్ని కార్యక్రమాలను విజయవంతం చేయాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ వివరించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ముందుకు సాగాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాచం గురుప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ జితేందర్రెడ్డి, ఉపాధ్యక్షులు గురిజాల శ్రీరాంరెడ్డి,



మాట్లాడుతున్న విజయ్చందర్రెడ్డి

ముత్యాల శ్రీనివాస్ గౌడ్, దామెర, ఆత్మకూర్ మండలాల అధ్యక్షులు జంగిలి నాగరాజు, ఇర్సడ్ల సదానందం, నియోజకవర్గ కోకన్వీనర్ ములుక ప్రసాద్, మాదారపు రతన్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శులు వేల్పుల రాజ్కుమార్, ఉప్పుగల్ల శ్రీకాంత్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముల్కనూరు ఎస్సైగా మహేందర్



ఎల్కతుర్తి : వరంగల్ సీపీ ఏవీ.రంగనాథ్ ఆదేశాల మేరకు భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరు పోలీస్స్టేషన్లో ఎస్సైగా ఎం.మహేందర్ శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన వరంగల్లోని మట్టెవాడ నుంచి ముల్కనూర్కు బదిలీపై వచ్చారు. ముల్కనూర్లో విధులు నిర్వహించిన ఎస్సై ప్రవీణ్కుమార్ వీఆర్కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్సై మహేందర్ మాట్లాడారు. ప్రజలకు ఏవైనా సమస్యలుంటే నేరుగా పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

గుడిసెవాసులకు పట్టాలివ్వాలి

ఎల్కతుర్తి : ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలివ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపెల్లి శ్రీనివాస్రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ గ్రామంలో శనివారం చేపట్టిన ప్రజా పోరు యాత్రకు విరాళాల సేకరణ కార్యక్రమంలో అయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం పార్టీ ఆధ్వర్యంలో ప్రజాపోరుయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. యాత్ర ఈనెల 25న బయ్యారంలో ప్రారంభమై ఏప్రిల్ 1న భీమదేవరపల్లి మండలంలోకి ప్రవేశిస్తుందని చెప్పారు. గ్రూప్-1 పరీక్షా పత్రాల లీకేజీ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఎమ్మెల్సీ కవితను కాపాడుకోవాలన్న ధ్యాస తప్ప ప్రజాసమస్యలపై సీఎం కేసీఆర్కు పట్టింపు లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి



విరాళాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

బయ్యారంలో ఉక్కు పరిశ్రమ, కాజీపేటలో రైల్వే కోచ్ పరిశ్రమ స్థాపించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో గిరిజన విశ్వవిద్యాలయానికి నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యుడు అధారి శ్రీనివాస్, మంచాల రమాదేవి పాల్గొన్నారు.

జీపీకి ఫ్రీజర్ అందజేత



ఐనవోలు : స్థానిక గ్రామ పంచాయతీకి వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ తన ఎంపీ లాడ్స్ నిధుల ద్వారా రూ.40 వేల విలువైన ఫ్రీజర్ బాక్స్ను అందించినట్లు సర్పంచ్ జన్ను కుమారస్వామి తెలిపారు. ఫ్రీజర్ బాక్స్ గ్రామ పంచాయతీకి శనివారం చేరుకోగా సర్పంచ్ కుమారస్వామి మాట్లాడారు. ఎంపీ దయాకర్కు గ్రామ పంచాయతీ పాలకవర్గం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అడ్డగూడి సతీష్కుమార్, వార్డు సభ్యులు బొల్లెపల్లి రమేష్, మొలుగూరి మహేందర్, కాటబోయిన సమ్మయ్య, చింత అశోక్, కార్యదర్శి కిషోర్, కారోబార్ షబ్బీర్, జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

దామెర : వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్సై ముత్యం రాజేందర్ కోరారు. మండలంలోని ఓగ్లాపూర్ సమీపంలోని సైలానీ బాబా దర్గా వద్ద జాతీయ రహదారిపై శనివారం నిర్వహించిన వాహనాల తనిఖీ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన పలువురిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే జరిమానాతోపాటు జైలు శిక్ష తప్పదన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, వాహన నెంబర్లను ట్యాంపరింగ్ చేయొద్దని, పెండింగ్ చలాన్లు చెల్లించాలని, ఇతర



వాహన పత్రాలు పరిశీలిస్తున్న ఎస్సై రాజేందర్

నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సైలు సిద్ధయ్య, రాజు, సిబ్బంది అశోక్, రమేష్, శ్రీనివాస్, రాము ఉన్నారు.

వాల్పోస్టర్ల ఆవిష్కరణ

శాయంపేట : ఈనెల 25న కాకతీయ యూనివర్సిటీలో తలపెట్టిన విద్యార్థి ఉద్యమకారుల సంఘర్షణ సభ కార్యక్రమానికి సంబంధించిన వాల్పోస్టర్లను మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో కేయూ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకుడు మంద నరేష్ మాట్లాడారు. రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు న్యాయం జరకపోగా ప్రభుత్వం నుంచి గుర్తింపు కూడా లభించడం లేదన్నారు. సంఘర్షణ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు నాగుల పవన్, రాకేష్, కృష్ణ, శ్రీకాంత్, పవన్, వినయ్, సాయికిరణ్, సురేష్ పాల్గొన్నారు.

బొమ్మ వెంకన్న సేవలు మరువలేనివి

ఎల్కతుర్తి : మాజీ ఎమ్మెల్యే బొమ్మ వెంకన్న అందించిన సేవలు మరువలేనివని బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు ముష్కె వెంకటేష్ తెలిపారు. మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలి వద్ద శనివారం బొమ్మ వెంకన్న 4వ వర్ధంతి నిర్వహించారు. వెంకన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకటేష్ మాట్లాడారు. వెంకన్న సేవలను కొనియాడారు. స్థానిక కార్మెల్ స్కూల్లోని అంధ విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మధుకర్గౌడ్, జనగాని కిష్టయ్య, పెరుకు మధుసూదన్, నాంపెల్లి అశోక్, చిదురాల వెంకటేష్, కొరె కార్తీక్, శ్రీకాంత్, పాక రమేష్, ఎర్రగొళ్ల రాజు, అంచనగిరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

విద్యుత్ నిలిపివేత.. సబ్స్టేషన్ ముట్టడి

శాయంపేట : మండల కేంద్రంలోని దళిత కాలనీలోని ఇళ్లకు విద్యుత్ అధికారులు శనివారం ఉదయం విద్యుత్ సరఫరా నిలిపేశారు. రాత్రి అయినా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించకపోవడంతో దళిత కాలనీవాసులు శనివారం రాత్రి విద్యుత్ సబ్స్టేషన్ను ముట్టడించి నిరసన తెలిపారు. ఏఈ రాజ్కుమార్తో వాగ్వివాదానికి దిగారు. ఈ సందర్భంగా ఏఈ రాజ్కుమార్ మాట్లాడుతూ విద్యుత్ మీటర్లు బిగించుకుంటే నెలకు 100 యూనిట్ల వరకు ఉచితంగా ప్రభుత్వం విద్యుత్ సరఫరా చేస్తుందని మూడ్రోజులుగా అవగాహన కల్పిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. పోలీసులు సబ్స్టేషన్కు చేరుకొని కాలనీవాసులతో, విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడారు. ఉన్నతాధికారులను పిలిపించి దళిత



సబ్స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

కాలనీవాసులతో మాట్లాడించాలని, తాత్కాలికంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని ఏఈ రాజ్కుమార్కు పోలీసులు సూచించారు. అనంతరం అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో ఆందోళనకారులు వెళ్లిపోయారు.

విద్యార్థుల ఉన్నతి అందరి బాధ్యత

- 'విద్యావారధి' అధ్యక్షుడు బీమళ్ల సారయ్య

ఐనవోలు : విద్యార్థులు ఉన్నతి సాధించేలా పర్యవేక్షించడాన్ని వారి తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల బాధ్యతగా విద్యావారధి సంస్థ అధ్యక్షుడు బీమళ్ల సారయ్య అభివర్ణించారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ మీట్కు ఆయన హాజరై మాట్లాడారు. ఒత్తిడి లేని వాతావరణంలో విద్యార్థులు పరీక్షలకు సిద్ధం అయ్యేలా పరిస్థితులు కల్పించడంలో తల్లిదండ్రులు కీలకమన్నారు. ఐనవోలు ఎంపీపీఎస్లో హెచ్ఎం శ్రీనివాస్రెడ్డి మాట్లాడారు. పరీక్షల సమయంలో విద్యార్థులను టీవీలకు దూరంగా ఉంచాలని తల్లిదండ్రులకు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్ఫోన్లను విద్యార్థులకు అందుబాటులో ఉంచవద్దని స్పష్టం చేశారు. ఉడుతగూడెం ఎంపీపీఎస్లో హెచ్ఎం చుంచుకాల లింగారావు మాట్లాడారు. సమ్మేటివ్ అసెస్మెంట్ (ఎస్ఏ-2)కు విద్యార్థులను ఇంటి వద్ద సిద్ధం చేసే విధానంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ బరిగల



మాట్లాడుతున్న హెచ్ఎం శ్రీనివాస్రెడ్డి

ఆరోగ్యం మాట్లాడుతూ విద్యార్థులు గురుకులాల్లో సీటు సాధించేలా బోధించాలని ఉపాధ్యాయులను కోరారు. ఎస్ఎంసీ చైర్మన్ తాటికాయల శ్రీను మాట్లాడుతూ పాఠశాల నిధులను వినియోగిస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్కు బాటలు వేయాలని తెలిపారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఉమాదేవి, మధుకర్, మహేందర్ రెడ్డి, లక్ష్మయ్య, ఎస్ఎంసీ చైర్మన్ కుమారస్వామి, చిదురాల మమత, భాస్కర్, ఏలియా, రాధిక, హరిత, సుంగు, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్బుక్స్ పంపిణీ

ధర్మసాగర్ : లీవ్ అండ్ లెట్ లివ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పడకంటి రాము జన్మదినం సందర్భంగా జిల్లా ఇన్చార్జ్, వేలేరులోని ప్రభుత్వ హైస్కూల్ ఉపాధ్యాయుడు బొల్లం కుమారస్వామి సొంత ఖర్చులతో స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు 12 చొప్పున నోట్బుక్కులను శనివారం పంపిణీ చేశారు. అనంతరం కుమారస్వామి మాట్లాడారు. పడకంటి రాము బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయినా అధైర్య పడకుండా కడు పేదరికంలోనూ కష్టపడి ఉన్నత స్థాయికి ఎదిగారని తెలిపారు. తాను ఎదగడమే కాకుండా పేద విద్యార్థుల ఉన్నతికి ఉపకరించేలా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడని చెప్పారు. రామును ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ఉన్నత స్థాయికి



నోట్బుక్స్ అందజేస్తున్న కుమారస్వామి

ఎదగాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగకుమారి, ఉపాధ్యాయులు వన్నాల శ్రీనివాస్, గడ్డి శ్రీనివాస్, సుదర్శన్, సమ్మెట వీరయ్య, శ్రీను, విద్యానంద్, రాజన్న, సారయ్య, శ్యాంసుందర్, తబిత, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతో యుద్ధానికి సిద్ధం కండి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దినేష్

కమలాపూర్ : మాదిగ, ఉపకులాలను నమ్మించి మోసగిస్తున్న బీజేపీపై యుద్ధానికి మాదిగ కులస్తులు సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ కోరారు. ఈనెల 27, 28వ తేదీల్లో మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్పీ) ఆధ్వర్యంలో తలపెట్టిన చలో ఢిల్లీ, ఏప్రిల్ 4న జరగనున్న హైదరాబాద్ దిగ్బంధం కార్యక్రమాల కరపత్రాలను ఎంఎస్పీ జిల్లా ఇన్చార్జ్ మంద రాజుతో కలిసి మండల కేంద్రంలో దినేష్ శనివారం ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలోని మాదిగల ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దినేష్ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా కేంద్రంలోని బీజేపీ 9 ఏళ్లుగా మోసపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రానున్న అన్ని ఎన్నికల్లోనూ బీజేపీకి గుణపాఠం చెప్పాలని సూచించారు. బీజేపీ అగ్రనేతలు మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దినేష్ తదితరులు


కార్యక్రమంలో ఎంఎస్పీ మండల ఇన్చార్జ్ శనిగరపు రవీందర్, జిల్లా ఇన్చార్జ్ గంగారపు శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ గద్దల సుకుమార్, నాయకులు నద్దునూరి ప్రసాద్, బొడ్డు శాంతిసాగర్, కొట్టె కల్యాణ్, చిలుక రాజు, వేల్పుగొండ భద్రయ్య, ఈసంపెల్లి స్వామి, అంబటి భూమయ్య, శనిగరపు రాజు, ఎరుకల సంఘం జిల్లా నాయకుడు దేవరాజ్ రమేష్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ఆత్మకూరు : విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని ఆయుష్ విభాగం జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ మంజుల తెలిపారు. మండలంలోని తిరుమలగిరిలోని కేజీబీవీలో ఆయుష్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బ్రహ్మీ గుళికలతో జ్ఞాపకశక్తి పెరుగుతుందని తెలిపారు. తొలుత పదో తరగతి విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ వాసవి, ఫార్మసిస్ట్ మొగిలి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మీ గ్రాన్యూల్తో జ్ఞాపకశక్తి పెంపు

శాయంపేట : బ్రహ్మీ గ్రాన్యూల్ వాడితే విద్యార్థులకు జ్ఞాపక శక్తి పెరుగుతుందని ఆయుర్వేద వైద్యాధికారి మంజుల తెలిపారు. మండలంలోని పెద్ద కోడెపాక గ్రామ శివారులోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణపై డాక్టర్ మంజుల అవగాహన కల్పించారు. అనారోగ్యం బారిన పడకుండా, జ్ఞాపక శక్తి పెంచుకునేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పదో తరగతి విద్యార్థులకు బ్రహ్మీ గ్రాన్యూల్స్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ధన్యకుమారి, ఉపాధ్యాయులు మంజుల, చైతన్య, శైలజ, ఇందిర, తదితరులు పాల్గొన్నారు.



పరకాల : మాట్లాడుతున్న డాక్టర్ మంజుల